

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జిల్లాలో నేడు

తలకొండపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తలకొండపల్లి, వెల్జాల్, పడకల్ గ్రామాలలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి తెలిపారు. రైతులు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యం ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ.2320, బీ గ్రేడ్ కు రూ. 2300 ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. సన్న రకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తుందని పేర్కొన్నారు. కేంద్రాల ప్రారంభ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి హాజరవుతున్నట్లు కేశవరెడ్డి తెలిపారు.



లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి క్యూలో భక్తులు





కీసరగుట్టపై శివలింగాలకు అభిషేకం చేస్తున్న భక్తులు

కార్తీకమాసం పురస్కరించుకొని ఆదివారం సెలవు రోజు కావడంతో కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి, చీర్యాల్ లక్ష్మీనరసింహస్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కీసర రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి శ్రీ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేయగా, లక్ష్మీ నరసింహస్వామికి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఈ మేరకు భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. కీసరగుట్టలోని శివలింగాలకు అభిషేకాలు చేసి కార్తీక దీపాలు వెలిగించగా, చీర్యాల్‌లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో కీసర ప్రధాన చౌరస్తా వద్ద ట్రాఫిక్ స్తంభించింది.

- కీసర, నవంబరు10 (ఆంధ్రజ్యోతి)

రూ.200 కోట్లతో కమ్మసేవా భవనం

» అరికెపూడి గాంధీ



మాట్లాడుతున్న అరికెపూడి గాంధీ

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కమ్మ కులస్తుల సంక్షేమం కోసం హైదరాబాద్‌లో రూ.200కోట్లతో కమ్మసేవా భవనాన్ని నిర్మించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్, రాష్ట్ర కమ్మసేవా సమితి అధ్యక్షుడు అరికెపూడి గాంధీ వెల్లడించారు. కమ్మసేవా సమితి షాద్‌నగర్ తాలుకా అధ్యక్షుడు పాతూరి వెంకటరావు ఆధ్వర్యంలో ఆదివారం షాద్‌నగర్‌లోని ఎంపీ శేషయ్యనగర్‌లో కార్తీక మాస వనభోజన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గాంధీ మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్ని దుష్టశక్తులు కమ్మవారిపై విషం చిమ్ముతూ, ద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్మ కులస్తులకు తాను అండగా నిలిచి, అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తానని గాంధీ తెలిపారు. ఈ సందర్భంగా బాలానగర్‌కు చెందిన గిరిజన విద్యార్థి పాత్లావత్ రఘు ఎంబీబీఎస్ చదువు కోసం కమ్మసేవా సమితి మహిళా సభ్యులు రూ.25వేల ఆర్థిక సహాయం చేశారు. తాళ్లూరి జీవన్, అడుసుమల్లి వెంకటేశ్వర్‌రావు, పూర్ణచందర్‌రావు, రవీంద్ర, పినపాక ప్రభాకర్‌రావు, గుదే వసంతరావు, నాగేశ్వర్‌రావు, శ్రీనివాసరావు, రామసుబ్బరావు, హరికృష్ణ, నాగేశ్వర్‌రావు, రఘు ఉన్నారు.

రహదారులే కల్లాలు!

ప్రమాదాలతో వాహనదారుల బెంబేలు

ఆరుగాలం కష్టించి పండించిన పంటను ఆరబెట్టుకునేందుకు అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. కల్లాలు అందుబాటులో లేక ప్రతీసారి ఇదో సమస్యగా మారింది. తేమ శాతం ఎక్కువగా లేకుండా చేసుకోవడానికి ధాన్యం ఆరబోతకు రైతులు రహదారులను ఆశ్రయిస్తున్నారు. కల్లాల నిర్మాణానికి ఐదేళ్ల క్రితం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశం కల్పించినప్పటికీ నిబంధనలు అడ్డొచ్చి ఎవరూ ముందుకు రాలేదు. ప్రత్యామ్నాయం లేక సగం రోడ్లను ఆక్రమిస్తూ ధాన్యం ఆరబోస్తున్నారు. దీనివల్ల వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. రాత్రి వేళ వరి కుప్పలు, వాటికి అడ్డుగా పెట్టిన రాళ్లు కనిపించక అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

నాలుగేళ్ల క్రితం జిల్లాకు మంజూరైన కల్లాల వివరాలు

మంజూరైన కల్లాలు	4,970
కేటాయించిన నిధులు	రూ. 37.97 కోట్లు
పూర్తయిన పనులు	572
ప్రారంభించనివి	4,398



కేశంపేటలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

- రోడ్లపైనే ధాన్యం నూర్పిడి, ఆరబోత
- కల్లాల నిర్మాణాలకు అడ్డొచ్చిన నిబంధనలు
- ఏర్పాటుకు ముందుకు రాని అన్నదాతలు
- ప్రత్యామ్నాయం లేక దారుల పక్కనే కుప్పలు
- ప్రతీ సీజన్‌లో అనేక యాక్సిడెంట్లు
- క్షతగాత్రులుగా మిగులుతున్న వాహనదారులు

రంగారెడ్డి అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వరి కోతలు జోరందుకున్నాయి. గత ఏడాది 1,32,559 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేయగా ఈ సారి 1,38,187 ఎకరాల్లో వరిని సాగుచేశారు. గత ఏడాది సాగు కంటే ఈ సారి 5,628 ఎకరాల్లో సాగు పెరిగింది. 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సన్నాలకు రూ.500 బోనస్ కూడా ప్రకటించడంతో రైతులు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించేందుకు సమాయత్తమవుతున్నారు. అయితే ధాన్యాన్ని ఆరబెట్టేందుకు కల్లాలు లేక రోడ్లను ఆశ్రయిస్తున్నారు.

కల్లాలపై రైతుల అనాసక్తి

ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే తేమ శాతం లేకుండా చూసుకోవాలి. ధాన్యం ఆరబోతే పెద్ద సమస్యగా మారింది. కల్లాలు లేక రోడ్లపై ఆరబోస్తున్నారు. ఇవి వాహనదారుల పాలిట ప్రమాదకరంగా మారాయి. అయితే రైతుల అవస్థలను దృష్టిలో పెట్టుకుని ఐదేళ్ల క్రితం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ క్షేత్రాల్లో కల్లాల నిర్మించుకునే అవకాశం కల్పించింది. జిల్లా

మిగతా 8వ పేజీలో...



మత్స్యకారులకు చేపపిల్లలు పంపిణీ చేస్తున్న అధికారి పూర్ణిమ

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

» మత్స్యశాఖ జిల్లా అధికారి పూర్ణిమ

కొత్తూర్, నవంబర్ 8:(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చేపపిల్లల పంపిణీని మత్స్యకారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని మత్స్యశాఖ జిల్లా అధికారి పూర్ణిమ ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం మత్స్యకారులకు చేపపిల్లలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తూర్ మండలానికి 1,89,793 చేపపిల్లలను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ డోలీ రవీందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి. దేవేందర్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, అంబటి ప్రభాకర్, శేఖర్‌రెడ్డి, దేవేందర్‌ముదిరాజ్, మత్స్య సహకార సంఘం నాయకులు గుండు సురేష్, మాసుల అంజయ్య, సత్తయ్య, నర్సింహ్మా, యాదయ్య పాల్గొన్నారు.



రోడ్డుపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

తాగునీటి కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు

షాద్‌నగర్‌రూరల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా లేదని ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామస్తులు ఆదివారం రోడ్డెక్కారు. ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో చాలాచోట్ల పైపులైన్లు లీకేజీ అవుతున్నాయని, వాటివల్ల నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వాపోయారు. లీకేజీ వల్ల నీరు కలుషితమై రోగాల బారినపడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.



బస్సు కోసం ఎండలో రోడ్డుపై నిరీక్షిస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు

బస్ షెల్టర్ లేక ప్రయాణికుల పాట్లు

నిలువ నీడ లేదు.. కూర్చునే పరిస్థితి లేదు

» రోడ్డుపైనే జనం పడిగాపులు » ఒంటికి, రెంటికి తప్పని తిప్పలు

» పట్టించుకోని పాలకులు, అధికారులు

నందిగామ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతమైన నందిగామ మండల కేంద్రంలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నిలువ నీడ లేక పాట్లు పడుతున్నారు. బస్సుల కోసం రోడ్డుపైనే పడిగాపులు కాస్తున్నారు. ఇక ఒంటికి, రెంటికి వస్తే ఇక కష్టమే. అధికారులు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, కార్మికులు, విద్యార్థులు ఈ ప్రాంతం నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. నందిగామకు కూతవేటు దూరంలో ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన కన్హాశాంతివనంతో పాటు అంతర్జాతీయ సింబియాసిస్ విశ్వవిద్యాలయం వెలిశాయి. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న నందిగామలో బస్‌షెల్టర్ ఏర్పాటుచేయకపోవడం దారుణమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఎండకు ఎండుతూ..

నందిగామ మండలకేంద్రం 32 గ్రామాలకు జంక్షన్. ఎంతో మంది ఔత్సాహికులైన పారిశ్రామికవేత్తలు ఇక్కడ పరిశ్రమలు

మిగతా8వ పేజీలో...

ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు



గ్రామాల నుంచి మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. బస్ షెల్టర్, మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారు. బస్సుల కోసం ఎండలో రోడ్డు పక్కన వేచి చూడాల్సి వస్తుంది. కొన్నేళ్లుగా బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు, పాలకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

సాయిబాబా,
సీపీఎం మండల కన్వీనర్

రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్ సర్కార్

ఇబ్రహీంపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు చేయకుండా జాప్యం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడ- మల్‌శెట్టిగూడ గ్రామాల మధ్య కల్లాల్లో నిల్వ చేసిన వరి ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. కోతలు మొదలై నెల రోజులు కావొస్తున్నా ధాన్యాన్ని కొనకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ ఇంకా కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోందని ధ్వజమెత్తారు. సగం మంది రైతులకు రుణమాఫీ చేయలేదని, రైతు బంధు ఇవ్వలేదని, రైతుబీమా జాడే లేదన్నారు. అనంతరం జిల్లా పౌర సరఫరాల అధికారితో ఆయన ఫోన్‌లో మాట్లాడగా... నేటి (సోమవారం) నుంచి ధాన్యం కొనుగోళ్లు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, రైతు నాయకుడు మొద్దు అంజిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు అల్వాల వెంకట్‌రెడ్డి, నాయకులు ఆకుల యాదగిరి, క్యామ శంకర్ తదితరులున్నారు.



రైతులతో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీపీ అవినాష్ మహంతి

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

ఆలయాలపై దాడి చేస్తే వదలం

జూకల్ గ్రామాన్ని సందర్శించిన సీపీ అవినాష్ మహంతి

శంషాబాద్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీసీ కెమెరాలతో 90 శాతం నేరాలను తగ్గించవచ్చని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. శనివారం రాత్రి మండల పరిధిలోని జూకల్‌లో చౌడమ్మ ఆలయంపై దాడి జరిగిన విషయాన్ని తెలుసుకున్న సీపీ ఆదివారం ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. ప్రతీ గ్రామంలో ఆలయాలు, మసీదులు ఉంటాయని, అన్నిటికీ పోలీసులు రక్షణ కల్పించలేరన్నారు. వాటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల దాడులు జరగకుండా చూడవచ్చన్నారు. ఒకవేళ దాడులు జరిగితే ప్రజలు సంయమనం పాటించాలని సూచించారు. దేవాలయలపై వరుసగా జరుగుతున్న దాడులపై పోలీస్‌శాఖ సీరియస్‌గా ఉందని చెప్పారు. నిందితులను ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదని స్పష్టం చేశారు. అంతకుముందు శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను సీపీ సందర్శించారు. కేసు వివరాలను కిందిస్థాయి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీసీపీ రాజేష్, అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ నరేందర్‌రెడ్డి ఉన్నారు.

మార్గదర్శకాలకు అనుగుణంగా సమగ్ర కుటుంబ సర్వే

» కలెక్టర్ నారాయణరెడ్డి



ఉప్పరిగూడలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

ఇబ్రహీంపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో హౌస్ లిస్టింగ్ సర్వే దిగ్విజయంగా నిర్వహించామని, ఇదే ఉత్సాహంతో సమగ్ర కుటుంబ సర్వేను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి చేస్తామని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామంలో జరుగుతున్న సర్వేను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 5,376 ఎన్యుమరేషన్ బ్లాకులుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రతీ బ్లాకులో ఎన్యుమరేటర్లను నియమించి సర్వే ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. ఎన్యుమరేటర్ల కొరత ఏర్పడకుండా మరికొంత మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చి అవసరమున్నచోటకు పంపిస్తామని తెలిపారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా సర్వే జరుగుతోందన్నారు. అధికారులు సర్వేకు వచ్చినప్పుడు కుటుంబ పెద్ద ఆధార్, రేషన్ కార్డులను చూపాలని సూచించారు. సమగ్ర సమాచారం సేకరించడం ద్వారా అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం సులభమవుతుందన్నారు. సర్వే 15 రోజుల్లో పూర్తవుతుందని, ఆ తర్వాత పది రోజుల్లో డేటా ఎంట్రీ ఉంటుందన్నారు. అంతకుముందు రెండు కుటుంబాల్లో జరుగుతున్న సర్వే తీరును పరిశీలించి ఎన్యుమరేటర్లకు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు సునీతా రెడ్డి, ఎంపీడీవో వెంకటమ్మ ఉన్నారు.

ఘనంగా సదర్



నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లో ఆదివారం రాత్రి సదర్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దున్నపోతులు చేసిన విన్యాసాలు అలరించాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నడికూడ యాదగిరి యాదవ్, రఘునాథ్ యాదవ్. నర్సింహ్మా యాదవ్, పరందాములు, బక్కన్న యాదవ్, శ్రీవర్ధన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

కళతప్పిన క్రీడా ప్రాంగణాలు

- కరువైన కనీస వసతులు
- ఆట వస్తువుల జాడే లేదు
- గ్రామాలకు దూరంగా ఆటస్థలాలు
- మినీస్టేడియం ఏర్పాటుకు డిమాండ్


పిచ్చిగడ్డితో నిండిన చిన్నతూండ్ల క్రీడా ప్రాంగణం

యాచారం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల పరిస్థితి దయనీయంగా మారింది. ఏ గ్రామంలో నూ ఆటస్థలాలు గ్రామానికి సమీపంలో ఏర్పాటు చేయలేకపోగా వాటిలో ఆడేందుకు కనీస వసతులు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో క్రీడాకారులు ఆయా ప్రాంగణాల్లో ఆటలు ఆడలేకపోతున్నారు. వాటిని పట్టించుకునే వారు లేకపోవడంతో ఆ స్థలాల్లో పిచ్చి మొక్కలు, గడ్డి ముళ్లకంపతో నిండిపోయాయి. ఖోఖో, వాలీబాల్, కోర్టులతో పాటు లాంగ్‌జంప్, హైజంప్ చేసుకునేందుకు కనీస వసతులు ఏర్పాటు చేయడంలో పంచాయతీలు సైతం విఫలమయ్యాయి.క్రికెట్ కిట్‌లు పంపించిన అధికారులు క్రికెట్ ఆడేందుకు అనువైన స్థలం ఏ గ్రామంలోని క్రీడా ప్రాంగణాల్లో ఏర్పాటు చేయలేకపోవడం గమనార్హం.

మొక్కుబడిగా కిట్ల పంపిణీ

రెండేళ్లక్రితం అప్పటి ప్రభుత్వం మొక్కుబడిగా క్రీడాకిట్లు పంపిణీ చేసింది. క్రికెట్ బ్యాట్లు, బంతులు. వాలీబాల్‌లు, నెట్‌లు, డంబెల్స్ పంపించారు. కానీ నేడు అవి ఎక్కడ ఉన్నాయో ఎవరికీ తెలియడం లేదని క్రీడాకారులు వాపోతున్నారు. మండలంలోని చిన్న తూండ్లలో బడరాళ్లమధ్యన వ్యాయమం చేయడానికి ఇనుపరాడ్లు బిగించారు. ప్రమాదవశాత్తు కింద జారి పడితే ప్రాణాలు గాలిలో కలవడం ఖాయమని క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు. వ్యాయమం చేసేచోట భారీ బండ రాళ్లుండడంతో వ్యాయమం చేయడానికి వీలు లేకుండాఉంది. అలాగే నజ్దిక్‌సింగారంలో గ్రామానికి కిలోమీటర్‌న్నర దూరంలో క్రీడా ప్రాంగణం ఉంది. కుర్మిద్దలో ఓ వెంచర్‌లో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు. గ్రామానికి దగ్గరగా ఉన్నా అందులోకి వెళ్లకుండా ఆ వెంచర్ యజమాని వెంచర్‌కు ప్రహరీ నిర్మించి తాళం వేయడంతో ఆటలు ఆడలేకపోతున్నామని క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు. గేటుకు తాళం వేసిన విషయమై ఎంపీవోతో ప్రస్తావించగా తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామని దాటవేశారు.


బండరాళ్ల మధ్యన ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు

ఇతర అవసరాలకు వద్దంటూ..

మేడిపల్లిలో గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఆటస్థలం ఉండగా అందులో ఆటలు ఆడటానికి వీలు లేకుండా ఉంది. యాచారం మండల కేంద్రంలో 1.5కి.మీ దూరంలో ఉంది. మేడిపల్లిలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూమిలో విశాలమైన స్థలం ఉందని దాంట్లో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయాలని యువకులు గ్రామ యువకులు కోరుతున్నారు. ఇందులో యువకులు రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్ ప్రాక్టీస్ చేస్తుంటారు. ఇక్కడ మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని స్థానిక యువత డిమాండ్ చేస్తున్నారు. ఇందులో మండలస్థాయి మినీ స్టేడియం కోసం తప్ప ఇతర అవసరాలకు వాడితే ఆందోళన చేపడతామని యువకులు, ప్రజా ప్రతినిధులు చెప్పారు. కాగా ప్రభుత్వం ఒక్కో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు రూ. మూడు లక్షల ధనం వెచ్చించారు. యాచారం, కొత్తపల్లి గ్రామాలకు ఇంత వరకు బిల్లులు రాలేదు.

తాళం తీసేయించి, శుభ్రం చేయాలి



మా గ్రామంలో వెంచర్‌లో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు. అందులోకి వెళ్లకుండ వెంచర్ నిర్వాహకుడు తాళం వేశారు. అలాంటప్పుడు అందులో ఎందుకు ఏర్పాటు చేశారో అధికారులు సమాధానం చెప్పాలి. క్రీడాప్రాంగణం అంతా గడ్డితో నిండి ఉంది. అందులోకి వెళ్లాలంటే యువకులు జంకుతున్నారు. పంచాయతీ అధికారులు వెంచర్ గేటు తాళం తీసేసి ప్రాంగణాన్ని పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించాలి. అలాగే ఆట వస్తువులు ఇప్పించాలి.

- ప్రభు, కుర్మిద్ద క్రీడాకారుడు

మొక్కుబడిగా క్రీడాప్రాంగణం ఏర్పాటు



మా గ్రామానికి 1.5కి.మీ దూరంలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు. అంత దూరం వెళ్లలేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంగణంలో ఓ గది కట్టించడంతో పాటు తాగు నీటి వసతి కల్పించాలి. మొక్కుబడిగా క్రీడాప్రాంగణం ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు.

- వి. రవీందర్‌రెడ్డి, నజ్దిక్‌సింగారం


సర్వే బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డీవో వెంకట్‌రెడ్డి

సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

రాజేంద్రగనర్ ఆర్‌డీవో వెంకట్‌రెడ్డి

శంషాబాద్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రాజేంద్రగనర్ ఆర్‌డీవో వెంకటొరెడ్డి సూచించారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని సమగ్ర సర్వే బూత్‌లను తహసీల్దార్ రవీందర్ దత్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి సంక్షేమ పథకాలుఅ అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరిస్తేనే అసలైన అర్హులకు సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. సిబ్బంది ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ముందువెళ్లాలని సూచించారు. ఎన్యుమరేటర్లకు ఇబ్బందులు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సర్వేపై ప్రజలకు సందేహాలు ఉంటే తక్షణమే నివృత్తి చేసుకోవాలని సూచించారు. సర్వే నిర్వహించే ప్రాంతాల్లో ముందుగా వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివరాల సేకరణలో తప్పులు ఉండొద్దు

మహేశ్వరం: సమగ్ర సర్వే వివరాల సేకరణలో ఎలాంటి తప్పులు లేకుండా అన్ని వివరాలతో కూడిన సమాచారాన్ని సేకరించాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ఎన్యూమరేటర్లకు సూచించారు. మహేశ్వరం మండలంలోని సిరిగిరిపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన సమగ్ర సర్వే వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంబంధిత కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను అడిగి తెలుసుకోవాలన్నారు. ఆయన వెంట మండల తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో శైలజ, సీడీపీవో శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు నొక్కేశారు!

ఆమనగల్లు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వైద్య చికిత్స చేయించుకున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సాయం చెక్కుల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు సమాచారం. 2022లో, 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కొందరు వ్యక్తులు అక్రమంగా డ్రా చేసినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు పేదలు గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తులు చేసుకున్నా ఇప్పటికీ చెక్కులు అందలేదు. దీంతో అనుమానం కలిగి సీఎంఆర్ఎఫ్ ఉన్నతాధికారులను కలిసి తమ దరఖాస్తులు ఏమయ్యాయని అడిగారు. ఏడాది క్రితమే చెక్కులు విడుదల చేశామని, డబ్బు కూడా డ్రా అయ్యిందని అధికారులు తెలపడంతో అవాక్కయ్యారు. వైద్య చికిత్సల కోసం నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నేరుగా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు లేకపోయింది. స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ సిఫారసు లేఖతో దరఖాస్తు చేయాల్సి వచ్చేది. మంజూరైన చెక్కులను ప్రభుత్వం నేరుగా లబ్ధిదారులకు కాకుండా సిఫారసు చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలకు ఇస్తుండేది. ఈ క్రమంలో కొన్ని చెక్కులను కల్వకుర్తి నియోజవకర్గంలో ఓ మాజీ ప్రజా ప్రతినిధి పీఏ, అనుచరులు డ్రా చేసుకున్నట్లు సమాచారం. లబ్ధిదారుల ఇంటిపేరు పూర్తిగా కాకుండా ఇంగ్లిషులో ఒకే అక్షరంతో ఉండడంతో ఆ పీఏ, అనుచరులు అక్రమంగా డ్రా చేసుకోవడానికి వీలు కలిగిందని సమాచారం. అదే అక్షరంతో మొదలయ్యే ఇంటిపేరు, అదే పేరు కలిగిన తమకు తెలిసిన వ్యక్తుల ఖాతాల్లోకి ఆ డబ్బు మళ్లించారని తెలిసింది. ఈ విషయం వెలుగు చూడడంతో వారు దరఖాస్తుదారుల కాళ్లావేళ్లా పడుతున్నట్లు సమాచారం. తాజాగా ఆ పీఏను నిలదీయగా శనివారం రాత్రి లక్ష రూపాయలు ఇచ్చి ఎక్కడా చెప్పొద్దని ప్రాధేయపడినట్లు తెలిసింది. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి కూడా వెళ్లగా విచారణకు ఆదేశించినట్లు తెలిసింది.

పెద్దజాతరకు అనంతగిరి ముస్తాబు

నేటి నుంచి అనంతుడి కార్తీక ఉత్సవాలు



- 15 రోజులు కొనసాగనున్న ప్రత్యేక పూజలు
- 15వ తేదీన రథోత్సవం.. 25న చక్రతీర్థంతో ముగింపు
- పెద్ద సంఖ్యలో హాజరుకానున్న భక్తులు
- అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసిన నిర్వాహకులు


ముస్తాబైన ఆలయం

వికారాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రం అనంతగిరి శ్రీ అనంతపద్మనాభ స్వామి దేవాలయం కార్తీక మాస పెద్ద జాతరకు ముస్తాబైంది. నేటి(సోమవారం) నుంచి ప్రారంభ మయ్యే ఉత్సవాలు 15 రోజులు పాటు కనులపండువగా జరుగున్నాయి. ఈ జాతరకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.

ధ్వజారోహణంతో ప్రారంభం

ఉత్సవాలను నేటి(సోమవారం) సాయంత్రం ధ్వజారోహణంతో ప్రారంభించనున్నారు. 12న కార్తీక ఏకాదశి ఉత్సవం, 13న రాత్రి 7 గంటలకు తులసి వివాహం నిర్వహించి 15న పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారి కల్యాణం, రథోత్సవం నిర్వహించనున్నారు. 25న ఉదయం 11 గంటలకు ఆలయ పుష్కరిణిలో చక్రతీర్థం కార్యక్రమంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ అధికారులు, అర్చకులు తెలిపారు.

ముస్తాబైన ఆలయం

జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. భక్తులకు రద్దీ దృష్ట్యా క్యూ ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి ఆలయాన్ని శోభాయానమానంగా తీర్చిదిద్దారు.

పుష్కరిణికి గ్రహణం.. నిరాశలో భక్తజనం



దేవాలయ ఆవరణలో స్వయంగా గంగాదేవి.. అనంతగిరి క్షేత్రానికి వచ్చి పుష్కరిణిగా మారిందని ప్రసిద్ధి. ఇక్కడ స్వామి వారిని దర్శించుకుంటే సకల పాపాలు హరిస్తాయని ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని భక్తుల నమ్మకం. గతంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇక్కడ రెండు మూడు రోజులు ఉండి ఇక్కడే స్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకునే వారు. అయితే కాలక్రమేనా పెరిగిన రవాణా వ్యవస్థతో భక్తులు ఉదయం వచ్చి సాయంత్రం వెళ్లిపోతున్నారు. అయితే పుష్కరిణి ఒక సంఘటన ఆధారంగా తాళలు వేసి మూసి వేశారు. పుష్కరిణి నుంచి నీటిని ఒక ట్యాంకులోకి ఎక్కించి ఆ నీటిని నల్లాలు, షవర్ల ద్వారా భక్తులు కాళ్లు చేతులు కడుక్కోవడానికి ఉపయోగిస్తున్నారు. ఒకప్పుడు అనంతగిరి అంటే ముందుగా పుష్కరిణి గుర్తుకు వచ్చేది. కానీ ఇప్పుడు అసలు అక్కడ పుష్కరిణి ఉందా అనే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పుష్కరిణి మళ్లీ వాడుకలోకి తీసుకువస్తే బాగుంటుందని భక్తులు కోరుతున్నారు. అయితే పుష్కరిణిలో చేపల పెంపకంపై కొందరు దృష్టి పెట్టడం వల్లే ఇలా జరుగుతుందని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తప్పులు లేకుండా వివరాలు సేకరించాలి

తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్


సర్వే బుక్‌లెట్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే ఫార్మేట్‌ను ఎలాంటి తప్పులు లేకుండా నింపాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. ఆదివారం తాండూరు పట్టణంలోని హేరూర్ వార్డులో కొనసాగుతున్న సర్వే తీరును ఆయన పరిశీలించారు. ఆ సమయంలో ఎన్యూమరేటర్ రాస్తున్న ఫారంను తీసుకొని పరిశీలించారు. అనంతరం ఒక ఫారం నింపడానికి ఎంత సమయం పడుతుంది? సమస్యలు ఏమైనా వస్తున్నాయా? అంటూ ఎన్యూమరేటర్‌ను అడిగారు. ఎన్యూమరేటర్ మాట్లాడుతూ ఒక ఫారం నింపేందుకు 45 నిమిషాల నుంచి గంట సమయం పడుతోందని వివరించారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారి మాణిక్ రావు, మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే దేశానికే ఆదర్శం

మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్



మహేశ్వరం, నవంబరు 10 ?(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక అసమానతలు తొలగించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తలపెట్టిన సమగ్ర కుటుంబ సర్వే దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. ఈ సర్వేకు కాంగ్రెస్ శ్రేణులు పూర్తిగా అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు. ఆదివారం తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అభివృద్ధి ఫలాలు పేద వర్గాలకు అందేలా కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలంటే కుల గణన సర్వే అవసరమని అన్నారు. ప్రభుత్వం చిత్త శుద్ధితో చేపట్టబోయే ఈ సర్వేపై విపక్షాలు అనవసర రాద్ధాంతం చేయకుండా సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. నవంబరు 14 నుంచి డిసెంబరు 9 వరకు 26 రోజుల పాటు రాష్ట్రంలో ప్రజా విజయోత్సవాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో విజయవంతంగా ఏడాది పాలన పూర్తి కావస్తున్నందున విజయోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

దైవానికి సేవచేయడం అదృష్టం

మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు


నూతన పల్లకీకి పూజ చేస్తున్న బక్కని నర్సింహులు, దాత బాల్‌రాజ్

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవుడికి సేవ చేసే భాగ్యం అందరికి రాదని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు అన్నారు. షాద్‌నగర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి స్థానిక వ్యాపారి పలబట్ల బాల్‌రాజ్‌గుప్తా నూతన పల్లకీని సమర్పించారు. ఆ పల్లకీకి ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాసచార్యులు శనివారం రాత్రి బక్కని నర్సింహులు చేత పూజ చేయించి, ఆలయానికి సమర్పించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ దేవుడికి కావాల్సిన వస్తువులను భక్తి, ప్రేమగుణం, పరోపకార బుద్ధి ఉన్న వారి నుంచే స్వీకరిస్తారని అన్నారు. ఏ కష్టం వచ్చినా దేవుడికే మొక్కుతామని, అదే దేవుడి సేవకు అవసరమైన వస్తువులు ఇచ్చే అవకాశం రావడం అదృష్టమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలబట్ల బాల్‌రాజ్‌గుప్తాను బక్కని నర్సింహులు అభినందించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పరిగి వెంకట సాయిశ్వర్‌రెడ్డి, లింగారం కుమార్‌గౌడ్, ఆర్.కృష్ణయ్య, ఒగ్గు కిషోర్, డాక్టర్ మల్లప్ప, ఎం.కుమార్, వేముల బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంపై దాడి చేసిన వారిని శిక్షించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న హిందూ సంఘాల నాయకులు

కేశంపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలం జూకల్ గ్రామంలో గ్రామ దేవతల ఆలయంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేశంపేట మండలం కేంద్రంలో ఆదివారం ఆలయంపై జరిగిన దాడికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. హిందూ ఆలయాలు, హిందూ దేవతల విగ్రహాలపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఇది ప్రజాస్వామ్యానికి మంచిదికాదని హితవు పలికారు. దాడికి తెగబడుతున్న వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప సాములు తిరుమలయ్య గౌడ్, పాండు గౌడ్, పవన్ కుమార్ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, గ్రామస్తులు రమణ గౌడ్, బైకని శేఖర్, అనసూయమ్మ, శంకర్, దశరథ్, బ్రహ్మచారి, టి. పాండు, శివ గౌడ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బైక్ రైడర్ మృతి

తూప్రాన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ రైడర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మన్సూరాబాద్ రాక్‌హిల్స్ కాలనీకి చెందిన దల్జిత్‌సింగ్(37), సఫిల్‌గూడ్ మల్కాజిగిరికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సాగర్ సంతోశ్‌గౌడ్‌లు వేర్వేరు వాహనాలపై బైక్ రైడ్‌కు ఆదివారం ఉదయం బయలుదేరారు. హైవే 44 మీదుగా వెళ్తుండగా తూప్రాన్ పట్టణ శివారులోని కరీంగూడ చౌరస్తా వద్ద పార్కింగ్ లైట్లు, ఇండికేటర్లు లేకుండా రోడ్డుపై నిలిపిన లారీని దల్జిత్‌సింగ్ బైక్‌తో ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన దల్జిత్‌సింగ్‌ను 108 అంబులెన్స్‌లో మేడ్చల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దల్జిత్ సింగ్ తండ్రి కుల్వంత్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పదేళ్లలో అభివృద్ధి పథంలో దేశం


మాట్లాడుతున్న ఈశ్వర్

పరిగి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పదేళ్లలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర కో-కన్వీనర్ ఈశ్వర్ అన్నారు. శ్రీదత్తుపంత్‌జీ జయంతిని పురస్కరించుకుని స్వదేశీ జాగరణమంచ్ ఆధ్వర్యంలో ఆదివారం పరిగిలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర కో-కన్వీనర్ ఈశ్వర్ మాట్లాడుతూ.. దేశం 500 ఏళ్ల కిందట స్వయం సమృద్ధి దేశంగా ఉండేదన్నారు. కాలక్రమేనా ఇతర దేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పదేళ్ల నుంచి దేశంలో పరిస్థితులు మెరుగుపడ్డాయన్నారు. దేశంలో కరోనా వ్యాక్సిన్ తయారీ నుంచి యుద్ధ పరికరాల వరకు స్వయంగా తయారు చేసి, ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరిందన్నారు. ఈ కార్యక్రమంలో పాలమూరు విభాగ్ టి.ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకటయ్య, చాకలి వెంకటేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భవిష్యత్‌లో బీజేపీదే అధికారం

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కీసర రూరల్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలో బీజేపీకి మద్దతు పెరుగుతుందని, భవిష్యత్తులో అధికారంలోకి రావడం ఖాయమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నాగారం మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు ఆదివారం ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరారు. వారందరికీ ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఆ పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి, నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు తిరుమల్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, జంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

మేడ్చల్ టౌన్: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహద పడుతాయని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ నైబర్ హూడ్ కమ్యూనిటీ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన 10వ, వార్షిక క్రీడల పోటీలను శనివారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ వయసుతో ప్రమేయం లేకుండా అన్ని క్రీడలను ఆడాలన్నారు. అసోసియేషన్ వారు ప్రతీ సంవత్సరం క్రీడల పోటీలను నిర్వహించటం అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, నైబర్ హూడ్ అసోసియేషన్ సభ్యులు మహేష్ రాజు, సందీప్, అభిషేక్, హేమా శంకర్, పాపారావు, బాబు రావు తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

భక్తిభావం అలవర్చుకోవాలి

ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి

కేశంపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజలు భక్తిభావం అలవర్చుకోవాలని షాద్‌గన్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో ఆదివారం కార్యసిద్ధి రామాంజనేయ ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు చిదంబరంశర్మ, మఠం శేఖరయ్యల నేతృత్వంలో ఆలయంలో వేదమంత్రోచ్చరణల మధ్య పూజలు చేశారు. అలాగే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు గోగు శశివర్ధన్ రెడ్డి, మడగొని శ్రీశైలం గౌడ్, గ్రామస్తులు అమర్‌నాథ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కె. శ్రీనివాస్ రెడ్డి దంపతులు హోమం నిర్వహించారు. కేశంపేట మాజీ జెడ్పీటీసీ పల్లె నర్సింగ్‌రావు, కేశంపేట మాజీ సర్పంచ్ తలసాని వెంకట్ రెడ్డి పూజలలో పాల్గొన్నారు. కార్యక్రమాలలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ వై. యాదయ్య యాదవ్, గూడ వీరేశ్, జగదీశ్వర్, సురేష్ రెడ్డి, యెన్నం శ్రీధర్ రెడ్డి, భాస్కర్ గౌడ్, అనుమగళ్ల రమేష్, కారుణకర్ రెడ్డి, కోడూరు రాములు, రాజేందర్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, రూప్లానాయక్, అఖిల్, శ్రీనాథ్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి


యాదవ కులస్తులతో కలసి అభివాదం చేస్తున్న జైపాల్ యాదవ్, శ్రీరాములు యాదవ్

కందుకూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): యాదవులు పాడిపశువులను వృద్ధి చేసుకుంటూనే, విద్యా, రాజకీయ, వ్యాపార రంగాల్లో రాణించాలని షాద్‌నగర్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్‌యాదవ్ సూచించారు. శనివారం రాత్రి మండల యాదవ సంఘం అధ్యక్షుడు పి.పర్వతాలు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. కందుకూరు సదర్ ఉత్సవంలో పెద్ద సంఖ్యలో యాదవ కులస్తులు పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. అంతకు మందు దున్నలతో హైదరాబాద్ -శ్రీశైలం జాతీయ రహదారిపై ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందేల శ్రీరాములు, అశోక్‌కుమార్ యాదవ్, కడారి జంగయ్య, నాయకులు బర్ల జగదీష్, క్రిష్ణ, పవన్, కె.బాల్‌రాజ్, నర్ల రామక్రిష్ణగోవర్ధన్‌యాదవ్, లింగంయాదవ్, నర్ల రాములు, మైసయ్య, జనార్ధన్, ఆంజనేయులు, రాములు, శ్రీశైలం, సత్యం, విశ్వనాథం, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన


జయస్తంభ ప్రతిష్ఠాపన వద్ద పూజలు నిర్వహిస్తున్న త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి

శంకర్‌పల్లి, నవంబరు10(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని సింగాపురంలో నూతనం గా నిర్మించిన మరకత కార్యసిద్ధి పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. దాంతో పాటుగా జయస్తంభాన్ని ప్రతిష్ఠించారు. పరమహంస పరివ్రాజకులు త్రిదండి దేవనాథ రామానుజ జీవర్‌స్వామి చేతుల మీదుగా యంత్ర, ఆంజనేయస్వామి విగ్రహ, జయస్తంభ(రాతితో నిర్మించిన స్తంభం), నాభిశిల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ప్రతిష్ఠాత్మకంగా జరిగాయి. అనంతరం ఉత్సవ మూర్తులకు సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనం, రుత్విక్‌ల సన్మానం, మహాప్రసాద సంతార్పణ కార్యక్రమాలు జరిగాయి. త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి భక్తులనుద్దేశించి ప్రవచనాలు వల్లించారు. సత్యం, ధర్మం, అహింసా సిద్ధాంతాలను అలవర్చుకుని ధార్మికంగా జీవించాలని ఆయన బోధించారు. భారతదేశం దేవభూమియని గుర్తు చేశారు. భగవంతుడు సర్వాంతర్యామియని, ఆయన అంతటా విస్తరించి ఉన్నాడని వివరించారు. కార్యక్రమంలో పట్టణ ప్రజలతో పాటుగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం ● పునరావృతం కాకుండా చూడాలంటూ డిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొర్రెముల రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 174లోని 12 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దాదాపు వంద కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు ఎలా బదలాయిస్తారని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కై ప్రభుత్వ భూములను కాజేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తప్పుడు పట్టాదారు పాసుపుస్తకాలు సృష్టించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఐదుగురికి పట్టాదారు పాసుపుస్తకాలు రావడానికి సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ భూబదాలయింపుపై సమగ్ర విచారణ జరిపించి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రొటోకాల్‌పై మాట్లాడడం విడ్డూరం

బీఆర్ఎస్‌పై మండిపడ్డ కాంగ్రెస్ నేత సింగిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఘట్‌కేసర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):బీఆర్ఎస్ నాయకులు ప్రొటోకాల్ గురించి మాట్లాడటం అంటే దయ్యాలు వేదాలు వల్లించడమే అవుతుందని పోచారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి నియోజకవర్గ ఎస్సీసెల్ కన్వీనర్ ప్రవీణ్, హేమంత్ అన్నారు. ఆదివారం పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడు రోజుల క్రితం టీపీసీసీ ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ బీటీ రోడ్డు పనుల ప్రారంభం సందర్భంగా కొబ్బరి కాయ కొడితే ప్రొటోకాల్ పాటించలేదని నేరుపారేసుకోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 10సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడైనా ప్రొటోకాల్ పాటించారా ఒక్కసారి గుర్తుచేసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంను పార్టీ కార్యాలయంగా మార్చి చోటమోటా లీడర్ల అడ్డగా మార్చింది ఎవరని ప్రశ్నించారు. అధికారిక కార్యక్రమాల్లో ప్రతిపక్ష ప్రజాప్రతినిధులును ఎనాడైన గౌరవించారా అని నిలదీశారు. రూ. 30లక్షల ప్రత్యేక నిధులు ఇప్పించి పనులను పరిశీలిస్తే జీర్ణించుకోలేని స్థాయికి దిగజారడం విచారకరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ రెడ్డియా నాయక్‌తోపాటు కౌన్సిలర్లు సైతం పాల్గొన్నారని గుర్తు చేశారు. ఇకనైనా ఆపార్టీ నాయకులు గతంను ఒకసారి గుర్తుచేసుకొని మాట్లాడితే బాగుంటుందని అన్నారు. ఇష్టాను సారంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో యూసుఫ్, సుదాకర్‌నాయక్, ఎర్ర రాజు, ప్రభాకర్, నాగరాజు, లక్ష్మణ్, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నియామకపత్రం అందిస్తున్న నాయకులు

అన్నిగ్రామాల్లో రజక సంఘం నూతన కమిటీలు

చేవెళ్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని రజక సంఘాలకు నూతన కమిటీలు వేయనున్నట్లు చేవెళ్ల మండల రజక సంఘం అధ్యక్షుడు వై.శివకుమార్ తెలిపారు. నూతన కమిటీల ఎంపికలో భాగంగా ఆదివారం చనువల్లిలో.. రజక సంఘం నూతన అధ్యక్షుడిగా సీహెచ్.శివకుమార్‌ను నియమించి నియమకపత్రం అందజేశారు. చేవెళ్ల మండలంలోని 37గ్రామ పంచాయతీల్లో నూతన కమిటీలను వేసి సంఘాన్ని బలోపేతం చేసే దిశగా పని చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు మల్లేష్‌కుమార్, ప్రభాకర్, కుమార్, ఎం. మల్లేష్ తదితరులు ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

కేశంపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన నాగిళ్ల మైసమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. విషయాన్ని తెలుసుకున్న షాద్‌నగర్ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణ గౌడ్, రూ. 5వేలు, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రూ.5వేలు ఇలా రూ. 10వేలను మృతురాలి కుటుంబ సభ్యులకు అందించారు. అలాగే మృతురాలి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో బాల్‌రాజ్ గౌడ్, రాంరెడ్డి, యాదయ్య, బాలయ్య, లక్ష్మయ్య, నరసింహ, పురుషోత్తంగౌడ్, శ్రీరాములు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎదురుచూపులు

- మొక్కజొన్న కొనుగోలు కేంద్రం లేక రైతుల ఇక్కట్లు
- పంట నూర్పిళ్లు చేసి కల్లాల్లో ఆరబోత
- త్వరగా ఏర్పాటు చేయాలని అన్నదాతల వేడుకోలు


చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబోసిన మొక్కజొన్నలు

చేవెళ్ల. నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను అమ్ముకుందామంటే అన్నదాతలకు నిరాశే మిగులుతోంది. పంటను ఆరబెట్టి విక్రయిద్దామంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు కరువయ్యాయి. ముఖ్యంగా వరి, మొక్కజొన్న పంటలను విక్రయించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ, మొక్కజొన్న కొనుగోళ్లపై మాత్రం ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. చేవెళ్ల డివిజన్‌లో వేలాది ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేయగా.. వానకాలం పంట చేతికొచ్చింది. కానీ, మక్కల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఇంకా ఏర్పాటు చేయలేదు. దాంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. వానాకాలం సాగులో భాగంగా మొక్కజొన్న పంట చేతికొచ్చింది. రైతులు చాలా మంది యంత్రాలతో పాటు కూలీలతో మొక్కజొన్నలను పొలాల నుంచి తీయిస్తున్నారు. చాలా మంది రైతులు వ్యవసాయ మార్కెట్ యార్డులు, వారికి అనువుగా ఉన్న స్థలాల్లో మొక్కజొన్నలను ఆరబోస్తున్నారు. అయితే, ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మొక్కజొన్నలు క్వింటాళుకు ప్రభుత్వ మద్దతు ధర రూ.2,225గా నిర్ణయించింది. చేవెళ్ల డివిజన్ పరిధిలో ఈ ఏడాది వానకాలంలో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. చేవెళ్ల మండలంలో 479 ఎకరాల్లో సాగుచేశారు. అలాగే షాబాద్ మండలంలో 1920 ఎకరాల్లో, మొయినాబాద్ మండలంలో 227 ఎకరాల్లో, శంకర్‌పల్లి మండలంలో 964 ఎకరాల్లో సాగు చేశారు. కొనుగోలు కేంద్రాలు లేక రైతులు మక్కలను ఎక్కడ అమ్మాలో తెలియక ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించడంతో తగిన ధర పలకక నష్టపోతున్నారు. ప్రభుత్వం మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఈ ఏడాది పెరిగిన దిగుబడి

ఈ ఏడాది డివిజన్ పరిధిలో చాలామంది రైతులు మొక్కజొన్న సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు మొక్కజొన్న దిగుబడి గతంలో కంటే కొంత వరకు పెరిగిందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 6 నుంచి 9క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని చెప్పారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



రైతులు కష్టపడి పండించిన పంటలు చేతికి వచ్చినా విక్రయించలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. సకాలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను అన్ని విధాలా ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

- ఎన్ను సుదర్శన్‌రెడ్డి, రైతు ఇబ్రహీంపల్లి

మూడు రోజులుగా ఎండలో ఆరబెట్టాం



పంట కోసి నేరుగా చేవెళ్ల వ్యవసాయ మార్కెట్‌యార్డుకి తీసుకొచ్చాం. గత మూడు రోజులుగా పంటను ఎండబెట్టాం. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తుందని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నాం. పది ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. ఆలస్యం చేయకుండా కొనుగోలు చేయాలి. లేదంటే ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది.

- చింపుల కృష్ణారెడ్డి, రైతు, దేవునిఎర్రవల్లి

యార్డులో ఆరబోసి కాంటాకు సిద్ధం చేశాం



ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకుందామంటే ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. వడ్ల మాదిరిగానే మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. పది ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశా. దిగుబడి బాగానే ఉంది. గింజలను ఆరబెడుతున్నాం. కాంటా వేసుడే ఆలస్యం.

- ఎన్ను జైపాల్‌రెడ్డి, రైతు, ఇబ్రహీంపల్లి

క్రైం కార్నర్

విగ్రహాల ధ్వంసం కేసులో నిందితుడి రిమాండ్

- చౌడమ్మ, సోమన్న ఆలయాల్లో చోరీకి యత్నం..

విగ్రహాలను ధ్వంసం చేసిన మహారాష్ట్రవాసి

శంషాబాద్ రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆలయంలో ప్రవేశించి విగ్రహాలను ధ్వంసం చేసిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదివారం శంషాబాద్ పోలీసులు తెలిపారు. శంషాబాద్ డీసీపీ బి.రాజేశ్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని జూకల్ గ్రామంలోని చౌడమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తి శనివారం రాత్రి అమ్మవారికి అలంకరించిన చీర, పక్కనే ఉన్న సోమన్న ఆలయంలో స్వామివారికి అలంకరించిన పంచె, ధోవతి ధ్వంసం చేశాడు. ఈ సంఘటనపై గ్రామానికి చెందిన చౌడమ్మ, సోమన్న ఆలయ పూజారి కుమ్మరి కృష్ణ ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనుమానితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా సలీం ఆర్మన్ తాడ్వి అని, అతడు మహారాష్ట్రకు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. కాగా, గతంలో సలీం ఆర్మన్ రాయ్‌గడ్ జిల్లా తాల పోలీస్‌స్టేషన్‌లో దొంగతనం, ఇంటికి నిప్పు పెట్టిన సంఘటనలో జైలు శిక్ష అనుభవించినట్లు తెలిసిందన్నారు. కొన్నిరోజుల క్రితం హైదరాబాద్‌కు వచ్చిన సలీం శనివారం రాత్రి శంషాబాద్ మండలం జూకల్ గ్రామ శివారులో గల చౌడమ్మ, సోమన్న దేవాలయాల్లో దొంగతనానికి యత్నించి అమ్మవారి కుడి కన్ను ధ్వంసం చేసి, అలంకరించిన చీర, పక్కనే ఉన్న సోమన్న ఆలయంలో స్వామివారికి అలంకరించిన పంచె, ధోవతి ధ్వసం చేసినట్లు తెలిపారు. ఈ సంఘటనపై నిందితుడు సలీం ఆర్మన్ తాడ్విపై క్రైమ్ నెం.649/2024, యు/ఎస్ 333, 331 (4), 196, 298, 299 బీఎన్ఎస్ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి న్యాయస్థానం ముందు హాజరు పర్చి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. కాగా, పోలీసులు శంషాబాద్ పట్టణంతో పాటు రూరల్ ప్రాంతాల్లో వరుసగా ఆలయాలపై దాడి కేసుల్ని ఛేదించే పనిలో నిమగ్నమయ్యారు. వారం రోజుల్లో మూడు ఆలయాలపై దాడులు జరగడంతో తీవ్ర కలకలం రేగుతోంది. ఎలాగైన కేసులను ఛేదించి నిందితులను కటకటాల్లోకి నెట్టాలని పోలీసులు విచారణ చేపట్టారు. అందుకోసం ప్రత్యేక టీంలను రంగంలోకి దింపారు.

ఆలయ అభివృద్ధికి సహకారం అభినందనీయం


విరాళం అందజేస్తున్న బండ అశోక్

షాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సాయిరెడ్డిగూడ గ్రామంలోని మల్లికార్జున స్వామి దేవాలయం అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అభినందనీయమని ఆలయ కమిటీ సభ్యులు గోపాల్ అన్నారు. బండోనిగూడ గ్రామానికి చెందిన బండ అశోక్ ఆదివారం రూ.9లక్షల విరాళం అందజేశాడు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయం ఎంతో సుందరంగా నిర్మిస్తున్నామని, త్వరలోనే ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కసిరెడ్డికి నాయకుల ఘన స్వాగతం


కసిరెడ్డి నారాయణరెడ్డికి స్వాగతం పలికి సన్మానిస్తున్న నాయకులు


ఆమనగల్లు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విదేశీ పర్యటన ముగించుకొని రాష్ట్రానికి చేరుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. లండన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ పర్యాటక సదస్సులో రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి కసిరెడ్డి పాల్గొన్నారు. వారంరోజుల పర్యటన ముగించుకొని రాష్ట్రానికి వచ్చిన కసిరెడ్డికి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల నాయకులు స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో నారాయణరెడ్డిని సత్కరించారు. లండన్‌లో పర్యాటక అభివృద్ధిపై అధ్యయనం చేసినట్లు కసిరెడ్డి పేర్కొన్నారు. స్వాగతం పలికినవారిలో సురేందర్‌రెడ్డి, మెకానిక్‌బాబా, సంజీవ్‌కుమార్, వెంకట్ రెడ్డి, విజయ్‌రాథోడ్, జగన్, పర్వతాలు, తదితరులు ఉన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి


కడ్తాల : దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ముంతాజ్

కడ్తాల్/కేశంపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఓటు హక్కును పొంది సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ముంతాజ్ కోరారు. రాజ్యాంగం పౌరుడికి కల్పించిన హక్కు ఓటు అని.. దానిని ఉపయోగించుకొని ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని సూచించారు. కడ్తాల మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలోగల అన్నిపోలింగ్ బూత్‌లలో ఆదివారం కొత్తఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు బీఎల్‌వోలు దరఖాస్తులు స్వీకరించారు. పలు పోలింగ్ బూత్ లను ముంతాజ్ సందర్శించి బీఎల్‌వోలకు సూచనలు చేశారు. మార్పులు, చేర్పులకు దరఖాస్తులు రెండు రోజుల పాటు స్వీకరించడం జరిగిందన్నారు. అర్హులందరూ ఓటు నమోదు చేసుకోవాలని కేశంపేట తహసీల్దార్ మీర్ ఆజంఅలీ సూచించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి గ్రామాలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అర్హులందరు ఓటును ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అమరవాదిని కలిసిన వెంకటేశ్


లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న గంప వెంకటేశ్

ఆమనగల్లు , నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణను ఆదివారం డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి లక్ష్మీనారాయణ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్, అర్థం లక్ష్మయ్య లక్ష్మణ్‌గుప్త, సురేశ్, గంప శ్రీనివాస్, పద్మ నారాయణ, మిట్టపల్లి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

కారు యజమానిపై చర్యలు తీసుకోవాలి

యాచారం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కారు ప్రమాదంలో మరణించిన చరణ్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కొత్తపల్లి గ్రామస్తులతో పాటు మృతుడి బంధువులు తక్కళ్లపల్లి గేటు వద్ద సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. శనివారం తమ్మలోనిగూడ వద్ద బైక్‌ను కారు ఢీకొట్టడంతో కొత్తపల్లికి చెందిన చరణ్ మరణించగా చింతపట్లకు చెందిన రవి తీవ్రంగా గాయపడ్డ సంగతి విదితమే. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు, మృతుడి బంధువులు ధర్నా చేశారు. సీఐ నర్సింహరావు సంఘటనా ప్రదేశానికి చేరుకొని న్యాయం తెలిపారు.

'ధరణి' దరఖాస్తులను పరిష్కరిస్తున్నాం : ఆర్డీవో

ఇంటర్వ్యూ


ఆర్డీవో సాయిరాం

చేవెళ్ల, నవంబరు 10 : చేవెళ్ల డివిజన్‌లో రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఆర్డీవో సాయిరాం తెలిపారు. ధరణి పోర్టల్‌కు సంబంధించి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. గతంలో చాలా సమస్యలు పెండింగ్‌లో ఉండేవని, ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈమేరకు 'ఆంధ్రజ్యోతి'కిచ్చిన ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి : చేవెళ్ల డివిజన్ పరిధిలో ధరణి పెండింగ్ సమస్యలు ఎంత వరకు ఉన్నాయి ?

ఆర్డీవో : డివిజన్‌లో మొత్తం దరఖాస్తులు 85,010 రాగా.. అందులో 42,914 పరిష్కరించాం. సరిగా లేని వాటిని రిజెక్ట్ చేశాం. మండలాల వారిగా దరఖాస్తులు.. చేవెళ్ల 283, మొయినాబాద్ 401, శంకర్‌పల్లి 178, షాబాద్ 331 పెండింగ్‌లో ఉన్నాయి. దీంతోపాటు ఆర్డీవో కార్యాలయంలో 570 పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నెలాఖారు వరకు వాటిని పరిష్కరిస్తాం.

ఆంధ్రజ్యోతి : రైతుల పట్టాభూములు ప్రొహిబిటెడ్‌గా నమోదయ్యాయి. వాటిని ఎలా పరిష్కరిస్తున్నారు. రైతులకు ఇచ్చే సలహా ఏమిటీ?

ఆర్డీవో : పట్టాభూములు ఆన్‌లైన్ రికార్డుల్లో ప్రొహిబిటెడ్, ప్రభుత్వ భూమిగా నమోదైన రైతులు.. దరఖాస్తు చేసుకునే సమయంలో ధరణి పోర్టల్‌లో సరైన ఆప్షన్‌ను ఎంచుకోవాలి. లేదంటే అవి రిజెక్ట్ చేయబడుతాయి. కాగా, దరఖాస్తులను తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలో.. వాటికి సంబంధించిన రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక పంపిస్తాం. ఇప్పటివరకు డివిజన్ పరిధిలో డేటా కరెక్షన్ కోసం 791 దరఖాస్తులు వచ్చాయి. దీంతోపాటు మరో 99 దరఖాస్తులు ప్రొహిబిటెడ్ జాబితాకు చెందినవి ఉన్నాయి. ప్రస్తుతం వాటన్నింటినీ పరిశీలిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి భూసేకరణ ఎంతవరకు వచ్చింది?

ఆర్డీవో : హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణకు మొత్తం 124 ఎకరాల భూమి సేకరించాం. ఇందుకుగాను ప్రభుత్వం రూ.173 కోట్ల నిధులు ఇచ్చింది. భూసేకరణ ప్రక్రియ పూర్తి చేశాం. ఎక్కడా కూడా పెండింగ్‌లో లేదు. చేవెళ్ల, మొయినాబాద్ మండలాల్లో బైపాస్ రోడ్లకు సైతం భూసేకరణ పూర్తి చేశాం. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశాం. కోర్టు కేసులతో నిలిచిన వాటికి సంబంధించి రూ.2.86కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి : షాబాద్ మండలంలోని పారిశ్రామిక వాడలో భూసేకరణ, నష్టపరిహారం చెల్లించేంది ఇంకా ఏమైనా పెండింగ్‌లో ఉందా ?

ఆర్డీవో : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు షాబాద్ మండటంలోని సీతారాంపూర్, హైతాబాద్, చందనవెళ్లిలో నెలకొల్పిన పారిశ్రామికవాడకు భూసేకరణ పక్రియ పూర్తయింది. బాధిత రైతులకు డబ్బు చెల్లించాం. అయితే కొన్ని సర్వే నెంబర్లల్లో ఆర్ఎస్ఆర్ పెరిగిన విషయం తెలియక ఇంకా పరిహారం రాలేదని కొందరు చెబుతున్నారే తప్ప అందులో వాస్తవం లేదు.

ఆంధ్రజ్యోతి : డివిజన్ పరిధిలో రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. దీనిపై మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఆర్డీవో : ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియాన్ని కొందరు అక్రమంగా కొనుగోలు చేసి డబ్బు సంపాదిస్తున్నారు. అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. అలాగే రేషన్ డీలర్ల పాత్ర ఉంటే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. కాగా, రేషన్ బియాన్ని ఎవరైనా అమ్ముతున్నట్లు తెలిస్తే.. వెంటనే రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలి.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం


మత్స్యకారులకు చేపపిల్లలు అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మత్స్యకారుల అభివృద్ధి పథకం కింద కేశంపేట మండల కేంద్రంలో ఆదివారం మత్స్యకారులకు ఉచితంగా 4లక్షల50వేల చేపపిల్లలను మండలంలోని పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, కేశంపేట, కొత్తపేట, భైర్కాన్‌పల్లి, నిర్దవెల్లి, తొమ్మిదిరేకుల, కాకునూర్ గ్రామాల మత్స్యకారులకారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాలను సమానంగా చూస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం మత్స్యకారులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని విమర్శించారు. మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో అభివృద్ధి చెందాలని సూచించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వై. యాదయ్యయాదవ్, సీనియర్ నాయకులు జగదీశ్వర్, లంకాల సురేష్‌రెడ్డి, యెన్నం శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, రమేష్, కరుణాకర్‌రెడ్డి, రూప్లానాయక్, గిరిధర్ యాదవ్, రాజేందర్‌రెడ్డి, పెంటయ్య, రాములు, ప్రకాశ్‌గౌడ్, సుందరయ్య, అమీర్, పాండు, నర్సింహ, అనసూయమ్మ, భాస్కర్‌రెడ్డి, పర్వతాలు, ఆంజనేయులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ లేక ప్రయాణికుల పాట్లు

(5వ పేజీ తరువాయి)

స్థాపించారు. రియల్ వ్యాపారం కూడా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతుంది. ఈ ప్రాంతం నుంచి నిత్యం ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. షాద్‌నగర్, హైదరాబాద్, సికింద్రాబాద్, మహబూబ్‌నగర్, శంషాబాద్ ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రజలు నందిగామ మండలకేంద్రానికి రాక తప్పదు. బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడాలి వస్తుంది. ఎండకు ఎండుతూ.. వర్షానికి తడవాల్సి వస్తుంది. బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని పాలకులను, అధికారులను కలసి విన్నవించిన ఎలాంటి ఫలితం ఉండటం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వాలు మారినా మండల కేంద్రంలో బస్సు షెల్టర్ ఏర్పాటు కల నెలవేరడం లేదు.

పట్టించుకోని పాలకులు, అధికారులు

గతంలో నందిగామ మండల కేంద్రంలో బస్సు షెల్టర్ ఉండేది. శిథిలావస్థకు చేరడంతో పాటు రోడ్డు వైండింగ్‌లో కూల్చివేశారు. అప్పటి నుంచి ప్రయాణికులకు కష్టాలు తప్పడంలేదు. మండలకేంద్రంలో బస్‌స్టాండ్ నిర్మించేందుకు ప్రభుత్వ భూమి ఉందని, అక్కడే బస్‌స్టాండ్ నిర్మించాలని ప్రజలు అనేకమార్లు అధికారులకు, పాలకులకు మొరపెట్టుకున్న కార్యరూపం దాల్చడంలేదు. ఇప్పటికైనా స్పందించి మండల కేంద్రంలో బస్‌షెల్టర్‌తోపాటు మరుగుదొడ్లు, టాయిలెట్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

'కేసీఆర్‌వి పగటి కలలు'

కడ్తాల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అవినీతి కుంభకోణాలతో అన్ని వ్యవస్థలను విధ్వంసం చేసి ప్రజల చేత తిరస్కరణకు గురై అధికారం కోల్పోయిన మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌజ్‌లో ఉంటూ పగటి కలలు కంటున్నారని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్‌లు అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఇక అధికారం కల్ల అని అన్నారు. మక్తమాదారంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ నాలుగు నెలల కాలంగా ఫామ్‌హౌజ్‌కే పరిమితమైన కేసీఆర్‌కు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఎలా కనబడుతాయన్నారు. రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కేసీఆర్ పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మరో పదేళ్లపాటు కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అధికారంలో ఉంటుందన్నారు. గాడితప్పిన ఆర్థిక వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం దారిలో పెట్టేందుకు చర్యలు చేపట్టిందని నర్సింహ, శ్రీనివాస్ రెడ్డి, బీచ్యనాయక్‌లు తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాసిన కేసీఆర్, బీఆర్ఎస్ నేతలకు అధికారం పోయాక ప్రజలు, వారి సమస్యలు గుర్తొస్తున్నాయని వారు ఎద్దేవా చేశారు.

రహదారులే కల్లాలు!

(5వ పేజీ తరువాయి)

వ్యాప్తంగా 4,970 కల్లాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటీ నిర్మాణాలకు రూ. 37.97 కోట్లు మంజూరు చేసింది. అధికారులు రైతులకు అవగాహన కల్పించలేకపోయింది. దీంతో జిల్లాలో 572 కల్లాలను నిర్మించింది. ఇంకా 4,398 కల్లాలను నిర్మించాల్సి ఉంది. కానీ రైతులు పనులను ప్రారంభించక పోవడంతో వాటిని రద్దు చేసింది.

సమస్యను అధిగమించేందుకు..

ఈ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందుకు వచ్చింది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డు కలిగిన సన్నచిన్నకారు రైతులు తమ సొంత పొలాల్లో కల్లాల నిర్మాణం చేపట్టేందుకు నాలుగేళ్ల కిందట అవకాశం కల్పించింది. ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా, బీసీ, ఓసీ రైతులకు 90 శాతం రాయితీపై కల్లాల నిర్మాణం చేపట్టేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం కూడా ఆశించిన స్థాయిలో అమలుకు నోచుకోలేదు.

నిబంధనలే అడ్డు

ఈ పథకానికి రైతులు ఐదెకరాలలోపు వ్యవసాయ భూమి ఉండి.. తప్పనిసరిగా జాబ్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం ఉండాలనే నింబంధనలు కల్లాల నిర్మాణాలకు అడ్డంకిగా మారాయి. గ్రామాల్లో అధికశాతం రెండు నుంచి నాలుగు ఎకరాలున్న రైతులే ఎక్కువగా ఉన్నారు. తక్కువ భూమిలో 50 నుంచి 75 చదరపు గజాల్లో కల్లం నిర్మించడానికి ఎవరూ ఆసక్తి చూపలేదు. డబ్బులు లేక కొందరు, బిల్లులు సకాలంలో రావనే భయంతో మరికొందరు వెనుకడుగు వేశారు. ఆసక్తిలేని వారి రైతుల స్థానంలో కొత్త దరఖాస్తు చేసుకున్నవాఆరికి అవకాశం కల్పించలేకపోయారు.

నిర్మాణ స్వరూపం..

రైతు తన సొంత వ్యవసాయ క్షేత్రంలో కల్లాలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం మూడు రకాల డిజైన్లను తయారు చేసింది. వీటిలో అనుకూలమైన దాన్ని ఎంచుకుని నిర్మించుకోవచ్చు. రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. 50 స్క్వేర్ మీటర్ల కల్లం నిర్మాణానికి రూ.54 వేలు, 60 స్వేర్ మీటర్ల దానికి 68 వేలు, 75 స్క్వేర్ మీటర్లకు రూ.80 వేలు మంజూరు చేస్తుంది. భూమి సర్వేనెంబరు లైవ్ లోకేషన్ నిర్ధారించిన తర్వాతనే వీటి నిర్మాణాలు చేపట్టాలి.

ప్రాణాలు తీస్తున్న ధాన్యం కుప్పలు

వరి ధాన్యం తేమశాతం తక్కువగా ఉంటేనే మద్దతు ధర వస్తుంది. కల్లాలు లేక రహదారులపై ఆరబోస్తున్న ధాన్యం రాశులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఎక్కువ మంది రైతులు ఒకేసారి రోడ్లపై ధాన్యం ఆరబోస్తుండటంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతుంది. ప్రతిఏటా ఎక్కడో ఓచోట ప్రమాదం జరుగుతూనే ఉంటున్నాయి. పోలీసులు హెచ్చరిస్తున్నా రైతుల తీరు మారడం లేదు. పోలీసులు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి రోడ్లపై ప్రమాదకరంగా ధాన్యం ఆరబెట్టకుండా అవగాహన కల్పించాల్సిన అవశ్యతక ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కల్లాల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి



వంద శాతం సబ్సిడీతో రైతుల పొలాల్లో ప్రభుత్వం కల్లాలు నిర్మించి ఇవ్వాలి. జాబ్‌కార్డు, కొలతల నిబంధనలతో పాటు బిల్లులు సకాలంలో రావనే కారణంగా గతంలో వీటిని నిర్మించునేందుకు ముందుకు రాలేదు. తేమ శాతం నిబంధన ఉండటంతో ప్రసుత్తం రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వరి, మొక్కజొన్న ఆరబెట్టాల్సి వస్తుంది.

- ముత్యాల్‌రెడ్డి, పోమాల్‌పల్లి, కేశంపేట మండలం

ఇప్పుడు అవకాశం లేదు



రైతుల పొలాల వద్ద ధాన్యం ఆరబెట్టుకునేలా ఐదేళ్ల క్రితం కల్లాలను కట్టుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశం కల్పించింది. ఈజీఎస్ కింద అప్పట్లో కొంత మంది వీటిని నిర్మించుకున్నారు. ప్రస్తుతం ఈ స్కీం అందుబాటులో లేదు.

- శ్రీలత, డీఆర్డీఏ పీడీ

మండల కేంద్రం ఏర్పాటుకు ఆందోళన ఉధృతం

తలకొండపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి గ్రామస్థులు పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని జేఏసీ నాయకులు అన్నారు. మండల కేంద్రం ఏర్పాటుకు జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 10వ రోజుకు చేరాయి. పార్టీలు, సంఘాల నాయకులు కూర్చున్నారు. వెంకట్రావుపేట, గౌరిపల్లి, ఖానాపూర్, చౌదర్‌పల్లి, బల్సులప ల్లితండా, మెదక్‌పల్లి, వీరన్నపల్లి, కేపీ తండాల ను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్ కోరారు.

నూతన గృహప్రవేశంలో సీపీఐ నాయకులు

శంషాబాద్ రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. ఆదివారం శంషాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వారు పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.యాదగిరి, మండల కార్యదర్శి నర్రా గిరి, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు అన్నెపు ప్రభు తదితరులు పాల్గొన్నారు.


గృహ ప్రవేశంలో నారాయణ, సాంబశివరావు తదితరులు

సంక్షిప్తంగా

● **కందుకూరు** : మండల ముదిరాజ్ సంఘం పూర్తిస్థాయి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం గౌరవాధ్యక్షుడు కాకి రాములు, అడ్వైజరీ కమిటీ సభ్యులు కాకి దశరథ, జి.యాదయ్య, ఎడ్ల సుదర్శన్, మండల శాఖ అధ్యక్షుడు పిట్టల పాండులు ప్రకటించారు. మండల కేంద్రంలో మండల స్థాయి సమావేశం అనంతరం మాట్లాడారు. మండల ఉపాధ్యక్షులుగా నల్లి సుదర్శన్, ఎ.యాగిరి. ఎస్.నరేందర్, ఆర్.కృష్ణ, సీహెచ్ రవీందర్, పిట్టల యాదయ్య, డిల్లీ యాదయ్య, ఎ.శ్రీనివాస్, అనేమోని హరికృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా డిల్లీ శ్రీధర్, కె.సురేందర్, కోశాధికారిగా ఎస్.వెంకటేష్ మత్స్యశాఖ అధ్యక్షులుగా పి.లింగం, సోషల్‌మీడియా కన్వీనర్‌గా ఎస్.సత్యనారాయణ, కార్యదర్శులుగా ఎన్.యాదగిరి, జి.శ్రీను, పి.రమేష్, వెంకటేష్, పి.యాదయ్య, యూత్ మండలాధ్యక్షుడిగా కాకి మధుసుధన్, ఉపాధ్యక్షులుగా నీలం వెంకటేష్, తాళ్ల నరేందర్, డిల్లీ మాల కృష్ణ, మేరుగు, రాజు, ప్రధాన కార్యదర్శిగా మావిళ్ల ప్రవీణ్‌కుమార్, కార్యదర్శులుగా కె.నర్సింహ, ఎ.నర్సింహ, పి.మదన్‌మోహన్, పి.భాస్కర్, వి.రాఘవేందర్‌ను ఎన్నుకున్నారు.

●**కడ్తాల్/తలకొండపల్లి/ఆమనగల్లు/యాచారం/చేవెళ్ల** : సమగ్ర సర్వేను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రామేశ్వరిదేవి కడ్తాల మండలం రేఖ్యతండాలో ఎంపీడీవో సుజాతతో కలిసి పరిశీలించారు. తలకొండపల్లి మండలం రాంపూర్, మెదక్‌పల్లి, జంగారెడ్డిపల్లిలో మండల ప్రత్యేక అధికారి ముత్యాలు, ఎంపీడీవో శ్రీకాంత్‌లు పరిశీలించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల్లో సర్వే కొనసాగింది. కమిషనర్ వసంత పర్యటించి సర్వే తీరును పరిశీలించారు. సర్వేలో ఇబ్బందులు కలగకుండ చూసుకోవాలని జిల్లా స్త్రీ శిషు సంక్షేమాధికారి, మండల ప్రత్యేకాధికారి సంధ్యారాణి ఎన్యుమరేటర్లకు సూచించారు. యాచారం, మేడిపల్లిలో సర్వేను తనిఖీ చేశారు. అదేవిధంగా చేవెళ్ల చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య మండలంలోని కమ్మెట, గొల్లగూడ, ఈర్లపల్లి, ఎన్కెపల్లి తదితర గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు.